

బోధన్‌లో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఆయేషా ఫాతిమా, పార్టీ శ్రేణులు

# రైతాంగాన్ని ముంచిన కాంగ్రెస్

- రైతుభరోసాకు సెల్ఫ్ డిక్లరేషన్ షరతు శోచనీయం
- అందరికీ అన్నం పెట్టే రైతులను అవమానపర్చడమే
- రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
- 'రైతు భరోసా' దగాపై బోధన్, బాన్సువాడలో ఆందోళన

బోధన్/బాన్సువాడ, జనవరి 9: ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని నట్టేట ముంచిందని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుభరోసాకు సెల్ఫ్ డిక్లరేషన్ షరతు విధించడం శోచనీయమన్నారు. ఇది అందరికీ అన్నం పెట్టే రైతులను అవమానపర్చడమేనని అన్నారు. రేవంత్ సర్కార్ రైతు భరోసాతోపాటు ఆరు గ్యారెంటీలను అమలుచేయనందుకు నిరసనగా గురువారం బోధన్, బాన్సువాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ నాయకురాలు ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ధర్నా చేశారు. బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో ఎడ్ల బండితో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బోధన్‌లో ఆయేషా ఫాతిమా, బాన్సువాడలో షేక్ జుబేర్ మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను అమలుచేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పకతప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేవలం రూ.12 వేలు ఇస్తామని మోసం చేశాడంటూ దుయ్యబట్టారు. ఎగవేతకు సిద్ధమైన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు . ఏడాది కాంగ్రెస్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, రైతు రుణమాఫీ కూడా జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలను ఇచ్చి ప్రజలు, రైతులను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్ హామీలను అమలుచేసేవరకూ తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. బోధన్‌లో ధర్నా అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

బోధన్‌లో నిర్వహించిన ఆందోళనలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బోధన్ ఏఎంసీ మాజీ చైర్మన్ వీఆర్ దేశాయ్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎం.ఎ.రజాక్, బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ సాలూర, బోధన్, రెంజల్, ఎడపల్లి, నవీపేట్ మండలాల అధ్యక్షులు గోగినేని నర్సయ్య, సంజీవ్‌కుమార్, భూమ్‌రెడ్డి, శ్రీరామ్, నర్సింగ్‌రావు, పార్టీ నాయకుడు పి.రవికిరణ్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పార్టీ వివిధ విభాగాల నాయకులు భవానీపేట్ శ్రీనివాస్, శంకర్‌గౌడ్, లోకం శ్రీనివాస్, రవిశంకర్ గౌడ్, కృష్ణ, ప్రవీణ్, అనిల్ పటేల్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలో చేపట్టిన ధర్నాలో నాయకులు మోచి గణేశ్, రమేశ్ యాదవ్, చాకలి సాయిలు, చాకలి మహేశ్, మధు, అఫ్రోజ్, సాయిలు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎడ్ల బండితో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# ఆలయాలు వెలవెల

- నిలిచిపోయిన 'ధూపదీప నైవేద్యం' నిధులు
- మూడు నెలలుగా పేరుకుపోయిన బకాయిలు
- ఆందోళనలో అర్చకులు



### నిధుల్లేక ఇబ్బందులు..

ధూపదీప నైవేద్య పథకం కింద అర్చకులకు ఇచ్చే గౌరవ వేతనం మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నది. నిధులు లేకపోవడంతో ఆలయాల్లో ధూపదీపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. త్వరగా నిధులు విడుదల చేయాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌ను ఇటీవలే కలిసి విన్నవించాం.

\- డి. వాసుదేవ్ శర్మ, అర్చకుడు



### వేతనాలు విడుదల చేయాలి..

సకాలంలో గౌరవ వేతనాలు రాకపోవడంతో ధూపదీప అర్చకులు ఆందోళన చెందుతున్నారు. అర్చకుల గౌరవ వేతనాన్ని తొందరగా విడుదల చేయాలి. కేసీఆర్ ప్రభుత్వం అర్చకుల గౌరవ వేతనాన్ని ప్రతి నెలా 10వ తేదీ లోపు జమ చేసేది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మూడు నెలలుగా బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ఇబ్బందులు కలుగుతున్నాయి.

\- రాచప్ప, అర్చకుడు

### కేసీఆర్ హయాంలోనే వెలుగులు

ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో నిత్యం ధూపదీపం వెలగాలనే ఆలోచనతో 2007లో ప్రభుత్వం నిత్య ధూపదీప నైవేద్య పథకానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో 1358 ఆలయాలు ఉండగా, అందులో 594 ఆలయాలను నిత్య ధూపదీప నైవేద్య పథకానికి ఎంపిక చేశారు. ఇందులో నిజామాబాద్ జిల్లాలో 340, కామారెడ్డి జిల్లాలో 254 ఆలయాలున్నాయి. మొదట్లో ఒక్కో ఆలయానికి రూ. 2,500 చెల్లించేవారు. తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ధూపదీప నైవేద్యం కింద ఇస్తున్న మొత్తాన్ని రూ. 6 వేలకు పెంచింది. 2023 జూన్ నెలలోనూ మరో రూ.4 వేలు పెంచుతూ ఆ మొత్తాన్ని రూ. 10 వేలు చేశారు. ఇందులో పూజా సామగ్రికి రూ.4 వేలు, అర్చకుడికి రూ.6 వేలు గౌరవ వేతనంగా నిర్ణయించారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెలనెలా ఇవ్వాల్సిన అర్చకుల గౌరవ వేతనంలో జాప్యం జరుగుతున్నది. 2024 అక్టోబర్ నుంచి గౌరవ వేతనాలు లేక ధూపదీప నైవేద్య పథక అర్చకులు అందోళన చెందుతున్నారు. సంక్రాంతి వరకైనా గౌరవ వేతనాన్ని అందించాలని వారు కోరుతున్నారు.





సుభాష్‌నగర్, జనవరి 9: నిత్యం ధూపదీప నైవేద్యాలతో వెలగాల్సిన దేవాలయాలు నిధుల కొరతతో వెలవెలబోతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో కళ తప్పుతున్నాయి. కేసీఆర్ హయాంలో ఠంచన్‌గా డబ్బులు విడుదల కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితి మారిపోయింది. మూడు నెలలుగా బకాయిలు పేరుకు పోవడంతో ధూపదీప నైవేద్యాలకు ఇబ్బంది ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో మొత్తం 1,358 ఆలయాలు, మఠాలు ఉంటే అందులో ఆదాయం సమకూరేవి 65 మందిరాలే ఉన్నాయి. వీటిలో రూ. కోటి వరకు ఆదాయం ఉన్నవి (6 ఏ) కింద 6 ఆలయాలు, రూ. 25 లక్షల లోపు ఆదాయం ఉన్నవి (6 బి)11 ఆలయాలు, రూ.2 లక్షల లోపు ఆదాయం ఉన్నవి (6 సి) కింద 46 మందిరాలు, అలాగే 6(డి) కింద 2 మఠాలు కొనసాగుతున్నాయి. మిగతా ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద ప్రభుత్వం ఇచ్చే నిధులే ఆధారం. కానీ కొన్ని నెలలుగా నిధుల విడుదలలో జాప్యం జరుగుతున్నది.

# 'డబుల్ బెడ్రూం' బిల్లుల కోసం లంచం

- ఒక్కొక్కరి నుంచి రూ.6,500 వసూలు
- మోస్రా కారోబార్‌పై లబ్ధిదారుల ఆగ్రహం

మోస్రా (చందూర్), జనవరి 9: డబుల్ బెడ్రూం ఇండ్ల బిల్లులు ఇప్పించడానికి కొందరు లంచాలు తీసుకున్నారు. లబ్ధిదారుల అవసరాన్ని ఆసరా చేసుకొని డబ్బులు డిమాండ్ చేశారు. మోస్రాలో డబుల్ బెడ్రూం ఇండ్ల బిల్లుల ఇప్పిస్తానని స్థానిక కారోబార్ ఒక్కొక్కరి నుంచి రూ.6,500 వసూలు చేశాడు. ఏడాదైనా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు సదరు కారోబార్‌ను నిలదీయగా.. లంచం బాగోతం బయటపడింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మోస్రా మండల కేంద్రంలో వంద డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించారు. అర్హులందరికీ పంపిణీ చేయగా..గృహ ప్రవేశాలు కూడా చేసుకున్నారు. ఇందులో కొంతమంది ఇండ్లు నిర్మించుకున్న వారికి ఎన్నికలు రావడంతో చివరి విడుత బిల్లులు రాలేదు. సదరు బిల్లులు తాను ఇప్పిస్తానంటూ కారోబార్ నమ్మబలికి లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.6,500 వసూలు చేశాడు. డబ్బులు తీసుకొని ఏడాది గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు బుధవారం పంచాయతీ ఆవరణలో కారోబార్‌ను నిలదీశారు. తమ డబ్బులు తమకు ఇవ్వాలని పట్టుబట్టారు. తాను తీసుకున్న డబ్బులు కాంట్రాక్టర్‌కు ఇచ్చినట్లు కారోబార్ తెలిపాడు. సంక్రాంతి పండుగ తర్వాత కాంట్రాక్టర్‌తో ఇప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పడంతో బాధితులు శాంతించారు.



మోస్రా జీపీ కారోబార్‌ను నిలదీస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

# ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలి

- ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి
- జిల్లా జడ్జి సునీతా కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు




జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

వినాయక్‌నగర్, జనవరి 9: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జడ్జి సునీత కుంచాల, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, అదనపు డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, డీటీసీ దుర్గా ప్రమీల, ఆర్టీవో జె.ఉమామహేశ్వరరావు హాజరై ధర్నా చౌక్ వద్ద ద్విచక్ర వాహనాల ర్యాలీని జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ.. చైనా మాంజా వాడితే ఐదేండ్ల జైలుశిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేని వారిపై మోటరు వెహికిల్ చట్టం కింద కేసులు నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం హెల్మెట్ ధరించని వారికి గులాబీ పువ్వులు ఇచ్చి అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని వారికి కొత్త హెల్మెట్ అందజేసి తప్పని సరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో మొదటి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ రావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుష్బూ ఉపాధ్యాయ, అడిషనల్ జూనియర్ జడ్జి గోపీకృష్ణ, ఆర్మూర్, బోధన్ ఎంవీలు వివేకానంద రెడ్డి, అజయ్ కుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెల్లారేసరికి..

# డంపులు మాయం

- వంద ట్రాక్టర్ల ఇసుక తరలింపు
- విస్మయానికి గురైన అధికారులు
- కప్పలవాగును తోడేస్తున్న ఇసుకాసురులు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అక్రమ రవాణా



తరలించడానికి సిద్ధంగా ఉంచిన ఇసుక డంపులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

భీమ్‌గల్, జనవరి 9: ఇసుక మాఫియా బరితెగిస్తున్నది. నదులు, వాగులు కనిపిస్తే చాలు ఇసుకాసురులు అక్కడ వాలిపోతున్నారు. మండలంలోని కప్పలవాగు నుంచి ఇసుకను తోడేస్తున్నారు. వందలాది ట్రిప్పుల ద్వారా ఇసుకను తరలించి రహస్యప్రదేశాల్లో నిల్వ ఉంచుతున్నారు. తాజాగా బుధవారం గోన్‌గొప్పుల ప్రభుత్వ పాఠశాల వెనుక గల ఖాళీ ప్రదేశంలో వంద ట్రాక్టర్ల ఇసుక డంపులు ప్రత్యక్షం కావడం కలకలం రేపగా.. దీనిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఇసుక దందా మళ్లీ షురూ' శీర్షికన గురువారం వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. గురువారం ఉదయం తహసీల్దార్ షబ్బీర్, ఎస్సై మహేశ్ సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా ఇసుక డంపులు మాయమవడంతో అవాక్కయ్యారు. అక్రమార్కులు రాత్రికి రాత్రే ఇసుకను పొక్లెయిన్ సాయంతో లారీల్లో తరలించినట్లు గుర్తించారు.

### కప్పలవాగుపై వాలిన అక్రమార్కులు

కొంతకాలంగా మండలంలోని కప్పలవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నది. అధికార పార్టీ నాయకులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమం గా ఇసుకను తరలిస్తున్నారు. ఇదంతా అధికార పార్టీకి చెందిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కనుసన్నల్లో నడుస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక దందాకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఇసుక వ్యాపారం మూడు వందల ట్రాక్టర్లు.. 30 లారీలు అన్నట్లు సాగుతున్నది. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో కథనాలు ప్రచురితం కావడంతో అక్రమార్కులు కొంతకాలం స్తబ్దుగా ఉన్నారు. మండలంలోని గోన్‌గొప్పులలో వంద ట్రాక్టర్ల ట్రిప్పుల ఇసుక డంపులు వెలుగు చూడడంతో మళ్లీ అక్రమ రవాణాను ప్రారంభించారు.

### రెండు ఇసుక డంపుల సీజ్

గోన్‌గొప్పుల ప్రభుత్వ పాఠశాల వెనుక గల ఖాళీ ప్రదేశం నుంచి రాత్రి ఇసుకను మాయం చేయగా..అక్కడ తరలించడానికి సిద్ధంగా ఉన్న రెండు ఇసుక డంపులను సీజ్ చేశారు.

### వాహనాలను సీజ్ చేస్తాం..

అనుమతి పత్రాలు ఉంటేనే ఇసుకను తీసుకెళ్లాలి. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇసుక అక్రమ రవాణాకు వినియోగించే వాహనాలను సీజ్ చేస్తాం.

\- మహేశ్, ఎస్సై

### కేసులు నమోదుచేస్తాం..

ఇసుకను అక్రమంగా తరలిస్తే బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వ అనుమతులు ఉంటేనే ఇంటి నిర్మాణాల కోసం ఇసుకను తీసుకెళ్లవచ్చు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్‌చేయడంతోపాటు పెద్దమొత్తంలో జరిమానా విధిస్తాం. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి. ట్రాక్టర్ల యజమానులు కూడా ఇసుక అక్రమ రవాణాకు సహకరించవద్దు.

\- షబ్బీర్, భీమ్‌గల్ తహసీల్దార్

# అన్ని పోలీసుస్టేషన్లలో క్యూఆర్ కోడ్

- కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ
- కార్యాలయంలో పోస్టర్ల ఆవిష్కరణ

కామారెడ్డి, జనవరి 9: రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను రాష్ట్ర డీజీపీ జితేందర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. కామారెడ్డిలో ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధూ శర్మ పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. పోస్టర్లలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లింక్ https://qr.me.qr.com/aZMTxHDm ఓపెన్ చేసి అందులో పేర్కొన్న విధంగా పోలీసుల సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలుపాలని సూచించారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్లలో రిసెప్షన్ సెంటర్, స్టేషన్ హౌస్ అధికారి గది, వెయిటింగ్ రూం, బయటి ప్రవేశ ద్వారం వద్ద క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య, సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ జార్జ్, సిబ్బంది పాల్గొన్నారు.


